


# @75,038

## తొలిసారి ఈ స్థాయిలో ముగిసిన సూచీ

ముంబై, ఏప్రిల్ 10: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో చారిత్రక స్థాయికి చేరాయి. అటు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ రెండూ ఆల్‌టైమ్ హైల్లో ముగిశాయి. సెన్సెక్స్ తొలి సారి 75వేల మార్కు ఎగువన స్థిరపడింది. నిజానికి మంగళవారం ట్రేడింగ్‌లోనే మొదటి సారి 75,000 స్థాయిని సూచీ దాటింది. ఒకానొక దశలో మునుపెన్నడూ లేనివిధంగా 75,124.28కి వెళ్లింది. దీంతో ఇంట్రా-డే హై రికార్డు నమోదైంది. అయితే మదుపరుల లాభాల స్వీకరణతో చివరకు నష్టాలే మిగిలాయి. ముఖ్యంగా హెవీ వెయిట్ షేర్ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఈ క్రమంలో సెన్సెక్స్ 75వేల దిగువకే పరిమితమైంది. కానీ ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లకు పెద్దపీట వేయడంతో బుధవారం సెన్సెక్స్ 354.45 పాయింట్లు లేదా 0.47 శాతం ఎగిసి 75,038.15 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 421.44 పాయింట్లు పుంజుకొని 75,105.14 చేరినా దాన్ని నిలుపుకోలేకపోయింది. నిఫ్టీ సైతం 111.05 పాయింట్లు ఎగబాకి గతంలో ఎప్పుడూ లేనట్టుగా 22,753.80 వద్ద ముగిసింది. ఇంట్రా-డేలో 22,775.70 స్థాయిని తాకింది. ఈ లెవల్‌కు సూచీ వెళ్లడం ఇదే మొదటిసారి.

### నేడు మార్కెట్లకు సెలవు

రంజాన్ పర్వదినం సందర్భంగా స్టాక్ మార్కెట్లకు గురువారం సెలవు. ఈక్విటీల తోపాటు మనీ మార్కెట్లూ మూతబడుతాయని బాంబే స్టాక్ ఎక్స్చేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ వర్గాలు తెలిపాయి. శుక్రవారం యథాతథంగా మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది.

### ఆకట్టుకున్న ఎఫ్ఎంసీజీ, మెటల్ షేర్లు

ఎఫ్ఎంసీజీ, ఎనర్జీ, మెటల్ షేర్లు మదుపరులను అత్యధికంగా ఆకట్టుకున్నాయి. ఐటీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్బీఐ, ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, రిలయన్స్, నెస్లే షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.89 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.46 శాతం పెరిగాయి. చమురు-గ్యాస్ రంగ షేర్లు 1.74 శాతం, ఎనర్జీ 1.71 శాతం, మెటల్ 1.66 శాతం కమోడిటీస్ 1.30 శాతం, సర్వీసెస్ 1.15 శాతం మేర లాభపడ్డాయి.

### గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ప్రధాన ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా సూచీలు నష్టపోయాయి. హాంకాంగ్ సూచీ లాభపడింది. ఎన్నికల కారణంగా దక్షిణ కొరియా మార్కెట్లు మూతబడ్డాయి. ఇక ఐరోపా మార్కెట్లలో కీలక సూచీలైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ లాభాల్లో కదలాడుతున్నాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు లాభాల్లో ముగిసిన విషయం తెలిసిందే.

### రూ.402 లక్షల కోట్లకు..

*మార్కెట్ ర్యాలీతో మదుపరుల సంపద కూడా పరుగులు పెడుతున్నది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ బుధవారం మరో 2.27 లక్షల కోట్లు పెరిగింది. స్టాక్ ఎక్స్చేంజ్ వివరాల ప్రకారం రూ.2,27,024.52 కోట్లు పెరిగి రూ.4,02,19,353.07 కోట్ల (4.83 ట్రిలియన్ డాలర్లు) ఆల్‌టైమ్ హైకి చేరింది. సోమవారం తొలిసారి బీఎస్ఈ మదుపరుల సంపద రూ.400 లక్షల కోట్ల మార్కును దాటిన సంగతి విదితమే.*



# ఎంజీ హెక్టార్ బ్లాక్‌స్టోర్మ్

## ప్రారంభ ధర రూ.21.24 లక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 10: బ్రిటన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం ఎంజీ మోటర్..తాజాగా రాష్ట్ర మార్కెట్లోకి హెక్టార్ బ్లాక్‌స్టోర్మ్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మూడు రకాల్లో లభించనున్న ఈ మాడల్ రూ.21.24 లక్షల ప్రారంభ ధర నిర్ణయించింది. ఏడుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.21,93,800గాను, ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన మాడల్ ధర రూ.21,97,800గా నిర్ణయించింది. ప్రీమియం లుక్‌తో తీర్చిదిద్దిన ఈ మాడల్‌పై మూడేండ్ల వ్యారెంటీ కూడా కల్పించినట్లు కంపెనీ చీఫ్ కమర్షియల్ అధికారి సతీందర్ సింగ్ బజ్వా తెలిపారు. 2019లో హెక్టార్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసినట్లు, ఈసారి దీనిని మరింత ఆధునీకరించి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, ముఖ్యంగా స్మార్ట్ టెక్నాలజీ, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపరిచినట్లు చెప్పారు.

# 72 వేలకు పసిడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: బంగారం ధరలు రికార్డు స్థాయిలో పరుగెడుతున్నాయి. బుధవారం మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. వరుసగా మూడు రోజులుగా పెరుగుతున్న పుత్తడి ధర రూ.72 వేల మార్క్‌ను అధిగమించి మరో ఉన్నత శిఖరాలకు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల అంశాలకు తోడు దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ కూడా తోడవడంతో ఢిల్లీ బులియన్ మార్కెట్లో పది గ్రాముల ధర రూ.160 ఎగబాకి రూ.72 వేలకు చేరుకన్నది. మంగళవారం ఈ ధర రూ.71.840 వద్ద ఉన్నది. ఇటు హైదరాబాద్‌లోనూ 24 క్యారెట్ పదిగ్రాముల ధర మరో రూ.380 అందుకొని రూ.72,110ని తాకింది. అలాగే 22 క్యారెట్ ధర రూ.350 పెరిగి రూ.66,100కి చేరుకున్నది.

### రికార్డుకు వెండి ధరలు

పసిడితోపాటు వెండి ధరలు కూడా రికార్డుస్థాయికి చేరుకున్నాయి. ఢిల్లీలో కిలో వెండి రూ.200 అధికమై రూ.84,700 పలికింది. ఇటు హైదరాబాద్‌లో రూ.1,000 ఎగబాకి రూ.89 వేలుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,356 డాలర్లకు చేరుకున్నది. నిన్నటితో పోలిస్తే 6 డాలర్లు అధికమైంది. అలాగే వెండి 28.10 డాలర్లుగా ఉన్నది.

# భారత్‌కు ఎలాన్ మస్క్!

## పెట్టుబడులపై మోదీతో చర్చించనున్న టెస్లా సీఈవో



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: అమెరికాకు చెందిన విద్యుత్తు ఆధారిత కార్ల తయారీ దిగ్గజం టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఈ నెల భారత్‌కు రానున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఆయన సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా దేశంలో టెస్లా పెట్టుబడులపై ఓ ప్రకటన వచ్చే వీలుందని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. ఈ నెల 22 నుంచి 27 మధ్య మస్క్ భారత పర్యటన ఉండొచ్చని అంటున్నారు. ఆయన వెంట కంపెనీకి చెందిన ఇతర ఉన్నతాధికారులు కూడా ఉంటారని తెలుస్తున్నది. కాగా, గత ఏడాది జూన్‌లో అమెరికా పర్యటన సందర్భంగా మోదీతో మస్క్ భేటీ అయ్యారు. అప్పుడే ఈ ఏడాది భారత్‌లో పర్యటిస్తానని, దేశీయ మార్కెట్‌లోకి టెస్లాను తీసుకురావాలనుకుంటున్నానని మస్క్ ప్రకటించిన సంగతీ విదితమే. ఇదిలావుంటే కేంద్ర ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీని ప్రకటించిన కొద్ది వారాల్లోనే మస్క్ భారత్‌కు వస్తుండటం ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నది. నిజానికి భారత్‌లో పన్నులు ఎక్కువని, వాటిని తగ్గించాలని, ఈ విషయంలో మెట్టు దిగితేనే ఇక్కడ పెట్టుబడులను ఆలోచిస్తానని మస్క్ గతంలోనే చెప్పారు. ఈ క్రమంలో కనీసం 500 మిలియన్ డాలర్ల పెట్టుబడితో భారత్‌లో తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే దిగుమతి సుంకాలపై రాయితీలు వర్తించేలా కొత్త పాలసీని మోదీ సర్కారు తెచ్చింది. మరోవైపు టెస్లా తాము భారత్‌లో ఏర్పాటు చేయబోయే ప్లాంట్‌కు అనువైన ప్రాంతాన్ని అన్వేషించేందుకూ ఈ పర్యటనను చేస్తున్నదన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర మాజీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించిన విషయం తెలిసిందే. టెస్లా ప్రతినిధులతో చర్చలు జరిపి రాష్ట్రంలో ప్లాంట్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సలహా ఇచ్చారు.

### స్విఫ్ట్ మరింత ప్రియం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..ప్రత్యేకంగా రెండు మాడళ్ల ధరలను పెంచింది. తన హ్యాచ్‌బ్యాక్ స్విఫ్ట్ తోపాటు ఎస్‌యూవీ గ్రాండ్ విటారా మాడళ్ల ధరలను రూ.25 వేల వరకు సవరించింది. వీటిలో స్విఫ్ట్ ధరను రూ.25 వేలు పెంచిన సంస్థ..గ్రాండ్ విటారా మాడల్‌ను రూ.19 వేలు అధికం చేసినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. దీంతో స్విఫ్ట్ మాడల్ ధర రూ.5.99 లక్షల నుంచి రూ.8.89 లక్షలకు, సిగ్మా రకం గ్రాండ్ విటారా మాడల్ రూ.10.8 లక్షలకు చేరుకున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.

### క్రెటాకు అనూహ్య స్పందన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన హ్యుందాయ్ మోటర్‌కు చెందిన క్రెటాకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. కేవలం మూడు నెలల్లోనే లక్షకు పైగా బుకింగ్‌లు వచ్చాయని పేర్కొంది.

# తగ్గినా.. కొనసాగిన హవా

## మార్చిలో ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రూ.22,633 కోట్లు రాక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ల్లోకి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతున్నది. గత నెల మార్చిలో మరో రూ.22,633 కోట్లను ఈక్విటీ ఎంఎఫ్‌లు ఆకర్షించాయి. అయితే అంతకుముందు నెల ఫిబ్రవరితో పోల్చితే మాత్రం 16 శాతం తగ్గాయి. నాడు రూ.26,866 కోట్లుగా నమోదైనట్టు బుధవారం విడుదలైన దేశీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) గణాంకాలు చెప్తున్నాయి. అయినప్పటికీ వరుసగా 37వ నెల పెట్టుబడుల రాకే కనిపించింది. రంగాలవారీగా పెట్టుబడులపట్ల మదుపరులకు పెరిగిన ఆసక్తి, కొత్త ఫండ్ ఆఫర్లు పెరగడం కలిసొచ్చిందని నిపుణులు మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు.

### సిప్ అదుర్స్

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) నెలవారీ పెట్టుబడులు రికార్డు స్థాయికి చేరాయి. ఈ ఏడాది మార్చిలో రూ.19,270 కోట్లుగా ఉన్నాయి. ఫిబ్రవరిలో 19,187 కోట్లుగానే ఉన్నాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం మొత్తం సిప్ పెట్టుబడులు దాదాపు రూ.2 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోల్చితే 28 శాతం ఎక్కువ. ఇక గత నెల హైబ్రిడ్ ఫండ్స్ రూ.5,584 కోట్లను ఆకర్షించాయి. అయితే డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.1.98 లక్షల కోట్లు తరలిపోయాయి. మరోవైపు మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నుంచి మొత్తం పెట్టుబడుల ఉపసంహరణ ఈ మార్చిలో రూ.1.6 లక్షల కోట్లుగా ఉన్నది. మిడ్, స్మాల్‌క్యాప్ సూచీల్లో అధిక విలువలు, జనవరి-మార్చికిగాను అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులే ఇందుకు కారణం. మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలోని ఆస్తుల విలువ ఫిబ్రవరి ఆఖరుతో చూస్తే మార్చి ఆఖరున రూ.54.54 లక్షల కోట్ల నుంచి రూ.53.4 లక్షల కోట్లకు తగ్గుముఖం పట్టింది.

# వన్‌ప్లస్‌కు రిటైలర్ల షాక్

హైదరాబాద్, ఏప్రిల్ 10: చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వన్‌ప్లస్‌కు దేశీయ రిటైలర్లు షాకిచ్చాయి. మే 1 నుంచి కంపెనీకి చెందిన స్మార్ట్‌ఫోన్లను విక్రయించబోమని దిసౌత్ ఇండియా ఆర్గనైజెడ్ రిటైలర్స్ అసోసియేషన్(ఓఆర్ఏ) అల్టిమేటం జారీ చేసింది. కంపెనీకి చెందని మొబైళ్లను విక్రయించడంతో మార్జిన్లు అధికంగా ఉండటం లేదని, కొన్ని ఇతర సమస్యలను వన్‌ప్లస్ పట్టించుకోవడం లేదన్న కారణంతోనే వచ్చే నెల 1 నుంచి విక్రయాలు నిలిపివేయాలని నిర్ణయించినట్లు వన్‌ప్లస్ టెక్నాలజీ ఇండియా సేల్స్ డైరెక్టర్ రంజిత్ సింగ్‌కు రాసిన లేఖలో ఓఆర్ఏలో పేర్కొన్నది. దీనిపై వన్‌ప్లస్ అధికారులు స్పందించడానికి నిరాకరించారు.

# నిధుల సేకరణలో ముత్తూట్ ఫిన్‌కార్ప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: డిబెంచర్లను జారీ చేయడంతో రూ.360 కోట్ల నిధులను సేకరించనున్నట్లు ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రకటించింది. ఈ నెల 10న ప్రారంభమైన ఈష్యూ ఈ నెల 25న ముగియనున్నదని తెలిపింది. సంస్థ ఇలా నిధులను సేకరించడం ఇది 16వ సారి కావడం విశేషం. సెక్యూర్డ్, నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లను జారీ చేయనుండటంతో కనీసంగా రూ.360 కోట్లు, గరిష్ఠంగా రూ.1,100 కోట్లు సేకరించాలని సంకల్పించింది. ఈ ఎన్‌సీడీల కాలపరిమితి 26 నెలలు, 38 నెలలు, 60 నెలలు, 72 నెలలు, 94 నెలలతో మెచ్యూరిటీ పొందనున్నాయి.

